క్లుప్తంగా

శ్రీరామవరంలో అగ్ని ప్రమాదం



శ్రీరామవరంలో మంటలార్పుతున్న ఫైర్ సిబ్బంది

దెందులూరు: శ్రీరామవరంలో ఆదివారం తాటాకిల్లు షార్ట్‌సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదానికి గురైంది. దాదాపు రూ.90 వేలకుపైగా ఆస్తి నష్టం వాటిల్లింది. ఇంట్లో పెనుమాక వరమ్మ కుటుంబం, పెనుమాక గోపియ్య కుటుంబాలు నివసిస్తున్నారు. వస్తువులన్నీ పూర్తిగా దగ్ధమయ్యాయి. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలు అదుపు చేశారు. వైఎస్సార్ సీపీ దెందులూరు మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరికి తెలియజేసి ప్రభుత్వపరంగా వచ్చే సాయాన్ని త్వరితగతిన అందించేందుకు కృషి చేస్తానని వారికి హామీ ఇచ్చారు.

పాండురంగస్వామి ఆలయంలో లక్షపత్రి పూజలు



చేబ్రోలు పాండురంగ స్వామి ఆలయంలో లక్షపత్రిపూజలు చేస్తున్న భక్తులు

ఉంగుటూరు: చేబ్రోలు పాండురంగస్వామి ఆలయంలో లక్షపత్రిపూజలు ఆదివారం నిర్వహించారు. మహిళలు భక్తిశ్రద్ధలతో లక్షపత్రి పూజ చేశారు. చేబ్రోలు పాండురంగస్వామి ఆలయంలో శనివారం నుంచి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు.

భారీ తెరపై ప్రపంచ కప్ క్రికెట్ ఫైనల్ మ్యాచ్



ఎమ్మెల్యే కొఠారు కార్యాలయంలో వరల్డ్ కప్ ఫైనల్ మ్యాచ్‌ను వీక్షిస్తున్న ప్రజలు

పెదవేగి : క్రికెట్ అభిమానులు ప్రపంచ్ కప్ క్రికెట్ ఫైనల్ మ్యాచ్ వీక్షించేందుకు అనువుగా ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి పెదవేగి మండలం కొండలరావుపాలెం క్యాంపు కార్యాలయంలో భారీ తెరను ఏర్పాటు చేశారు. ఆదివారం మధ్యాహ్నం ఇండియా – ఆస్ట్రేలియా మధ్య ప్రపంచ కప్ ఫైనల్ మ్యాచ్ సందర్భంగా భారీ తెరను ఏర్పాటు చేయించి, ప్రజలతో కలిసి ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి మ్యాచ్‌ను వీక్షించారు.

రాట్నాలమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తులు



ప్రత్యేక పూల అలంకరణలో రాట్నాలమ్మ తల్లి

పెదవేగి: రాట్నాలకుంటలోని రాట్నాలమ్మ దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. అమ్మవారికి ఆదివారం ప్రీతికరమైన రోజు కావడంతో పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారికి మొక్కుబడులు తీర్చుకున్నారు. ఈ వారం అమ్మవారికి పూజాటికెట్ల విక్రయం ద్వారా రూ.18,010, విరాళాల రూపంలో రూ.13,200, లడ్డూ ప్రసాదంపై రూ.10,500, ఫొటోల అమ్మకంపై రూ.1,945 మొత్తం రూ.45,665 ఆదాయం లభించిందని దేవస్థాన ఈఓ ఎన్.సతీష్‌కుమార్ చెప్పారు.

120 మందికి వైద్య సేవలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ప్రజలు ఆహారపు అలవాట్లు మార్చుకుంటే ఆరోగ్యకర జీవితం కొనసాగించవచ్చని కాకరాల వేణుబాబు సూచించారు. ఏలూరు స్మార్ట్ సిటీ లయన్స్ క్లబ్, క్రీస్తు సంఘం, శ్రీ కృష్ణ హాస్పిటల్, ట్రస్ట్ క్లినిక్ సంయుక్త ఆధ్వర్యంలో విద్యానగర్ మనోరమా హోమ్స్ వెనుక క్రీస్తు సంఘం భవనములో ఆదివారం ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ బి.కృష్ణ, డాక్టర్ అభిలాష్, డాక్టర్ సువర్ణ ప్రత్యూష సుమారు 120 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఎస్‌వీ సుబ్రహ్మణ్యం, ఆర్‌సీ శేషుకుమార్, వీజీఎంవీఆర్ కృష్ణారావు, పి.మురళీకృష్ణ, దిద్ల ఆంజిలో పాల్గొన్నారు. 63 మంది విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ చేశారు.

దేశమంతా ప్రశంసించేలా రాష్ట్ర పురోగతి

- దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి
- గార్లమడుగులో 'ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలి'



సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కొఠారు, ఎంపీపీ, ఇతర ప్రజాప్రతినిధులు

పెదవేగి : నాలుగున్నర ఏళ్లలో పరిపాలనా సంస్కరణలు, వినూత్న కార్యక్రమాల ద్వారా దేశమంతా ప్రశంసించేలా మన రాష్ట్రం పురోభివృద్ధి సాధించిందని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. నాలుగున్నరేళ్లుగా రాష్ట్రంలో ప్రతి ఇంటికీ, ప్రతి పౌరుడికీ ప్రత్యక్షంగా, పరోక్షంగా చేకూర్చిన మేలును వివరిస్తూ రూపొందించిన ప్రతిష్టాత్మక కార్యక్రమం ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలి (వై ఏపీ నీడ్స్ జగన్) కార్యక్రమాన్ని ఆదివారం పెదవేగి మండలం గార్లమడుగు గ్రామ సచివాలయం వద్ద పల్లెకు పోదాం ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి మాట్లాడుతూ, ఈ నాలుగున్నర ఏళ్లలో పరిపాలనా సంస్కరణలు, వినూత్న కార్యక్రమాల ద్వారా ప్రభుత్వం పేదలకు అండగా నిలిచిందని అన్నారు. మన రాష్ట్రం సాధించిన పురోభివృద్ధిని అందరికీ క్షుణ్ణంగా తెలియజెప్పేలా, గత సర్కారుకు – వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి మధ్య వ్యత్యాసాన్ని చాటి చెప్పేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలి అనే కార్యక్రమానికి రూపకల్పన చేశారని తెలిపారు. జగనన్న పాలనలో జరిగిన మంచిని ప్రజలకు చెప్పాలని పార్టీ శ్రేణులకు, ప్రజాప్రతినిధులకు సూచించారు. ఎన్నికల హామీలను 99 శాతం నెరవేర్చిన విషయాన్ని మేనిఫెస్టో చూపిస్తూ ప్రజలకు వివరించి, మళ్లీ జగనన్నని సీఎంగా చేసుకోవాలని చెప్పే అద్భుతమైన కార్యక్రమమే వై ఏపీ నీడ్స్ జగన్ అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. మా ప్రభుత్వం వల్ల మేలు జరిగినట్టయితే మాకు మరో అవకాశం ఇస్తూ ఓటేయండి అని సభా ముఖంగా ఎమ్మెల్యే కోరారు. అనంతరం పేదలకు ఇళ్ల పట్టాలను ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ముందుగా వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేసి, సంక్షేమ పథకాల ప్రదర్శన ఫ్లెక్సీని అబ్బయ్యచౌదరి చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ పెనుమాల విజయ్‌బాబు, ఎంపీపీ తాతా రమ్య, పెదవేగి సొసైటీ చైర్‌పర్సన్ పెనుమాక వెంకట సుబ్బారావు, ముండూరు సొసైటీ చైర్‌పర్సన్ చెరుకూరి ప్రసాద్, సర్పంచ్ జిజ్జువరపు నాగరాజు, స్థానిక నాయకులు మేడికొండ కృష్ణారావు, కొల్లు రాము, మేడికొండ మురళి, జాస్తి సీతారామాంజనేయులు, మేడికొండ బుజ్జులు, పరిమి శివనాగరాజు, మేడికొండ సారథి, యలమంచి ప్రవీణ్‌చౌదరి, నెరుసు ధర్మరాజు, గోళ్ళ మల్లేశ్వరరావు, ఎంపీడీవో, జీఆర్ మనోజ్, తహసీల్దార్ నాగరాజు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, ఇతర ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

నేడు వాక్ విత్ అంబటి, కొఠారు

పెదపాడు: సత్రంపాడు నుంచి వట్లూరు సీఆర్ ఆర్ ఇంజనీరింగ్ కళాశాల వరకు సోమవారం నిర్వహించే 'వాక్ విత్ ఫార్మర్' కార్యక్రమంలో క్రికెటర్ అంబటి రాయుడు, ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి పాల్గొంటారని పెదపాడు ఎంపీడీవో ఎస్ సూర్యకుమార్ తెలిపారు. ఈ కార్యక్రమాన్ని అధికారులు, ప్రజాప్రతినిధులు విజయవంతం చేయాలని పెదపాడు మండలంలోని వట్లూరు గ్రామ సచివాల యం 2 సమీపంలోని సత్రంపాడు నుంచి ఉదయం 9.30 గంటల నుంచి ప్రారంభమవుతుందని తెలిపారు. అనంతరం సీఆర్ఆర్ కళాశాల మైదానంలో ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా క్రీడా పోటీలు ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మండలంలోని ప్రజాప్రతినిధులు అధికారులు పాల్గొనాలని కోరారు.

దళిత మంత్రిపై శవరాజకీయాలు చేస్తారా?

దెందులూరు: దళిత హోం మంత్రిపై టీడీపీ, జనసేన నాయకులు శవరాజకీయాలు చేయాలని చూడటం విచారకరమని ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర నాయకులు బయ్యారపు రాజేశ్వరరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు తనగాల శేఖర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వాస్తవాలు వక్రీకరించి ఎటువంటి సంబంధం లేని హోం మంత్రి తానేటి వనితకు బురద అంటించాలని ప్రత్యేక రాజకీయ పార్టీలు ప్రయత్నించడం సిగ్గు చేటు అన్నారు. దళిత హోం మంత్రి జోలికి వచ్చినా, అసత్య ప్రచారాలు ఆపకపోయినా, భవిష్యత్తు ప్రణాళికను ప్రకటిస్తామన్నారు. బాధిత కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా ప్రకటించిందని, రాజకీయ పార్టీలు ఈ విషయాలు గుర్తుంచుకోవాలని, నిజాయతీగా పనిచేస్తున్న హోం మంత్రిపై బురద చల్లాలని చూడటం సహించబోమని అన్నారు.

ఘనంగా హనుమద్ విగ్రహ ప్రారంభోత్సవం

కొయ్యలగూడెం: రామానుజపురంలో ఏర్పాటు చేసిన శ్రీ అభయ ఆంజనేయస్వామి విగ్రహ ప్రారంభోత్సవం ఆదివారం గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అర్చకులు మామిళ్ళపల్లి శివానందాచార్యుల పర్యవేక్షణలో ప్రత్యేక పూజలు చేశారు. రెండు రోజులపాటు హోమాలు నిర్వహించగా ఉదయం 9.43 గంటలకు 33 అడుగుల స్వామివారి భారీ విగ్రహాన్ని ప్రారంభోత్సవం చేశారు. మధ్యాహ్నం నుంచి సుమారు పదివేల మంది భక్తులకు అన్నసమారాధన చేశారు. ఈ కార్యక్రమానికి పరిసర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి
- గార్లమడుగులో గడపగడపకు మన ప్రభుత్వం



అనారోగ్యంతో బాధపడుతున్న వృద్ధుడిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

పెదవేగి : ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. పెదవేగి మండలం గార్లమడుగులో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి అధ్యక్షతన ఆదివారం ఘనంగా నిర్వహించారు. శనివారం రాత్రి పల్లె నిద్ర అనంతరం గార్లమడుగు పంచాయతీలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరికి ప్రజలు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా అబ్బయ్య చౌదరి గడపగడపను దర్శించి మహిళలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయా అని అక్క చెల్లెమ్మలను అడిగి తెలుసుకున్నారు. సున్నా వడ్డీ మొదలు అమ్మ ఒడి, వృద్ధాప్య పింఛన్లు, జగనన్న తోడు, జగనన్న ఆసరా, రైతు భరోసా పథకాలు అందాయా అని అడిగారు. ప్రతి గడపలో కుటుంబ యజమానులతో మమేకమై పిల్లలు చదువుతున్నారా, ఉద్యోగాలు చేస్తున్నారా, నిరుద్యోగులుగా ఉంటే నేను మీ పిల్లలకు ఉద్యోగ మేళాల ద్వారా జీవనోపాధి కల్పిస్తా అంటూ ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి హామీ ఇచ్చారు. అర్హత ఉండి పథకాలు అందని వారిని గుర్తించి పథకాలు అందే విధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు, వలంటీర్లకు, సచివాలయ సిబ్బందికి సూచించారు. ఎమ్మెల్యే గ్రామంలో పర్యటించి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకుని వాటిని పరిష్కరించారు. ఈ సందర్భంగా అబ్బయ్యచౌదరి మాట్లాడుతూ నవరత్నాల పేరిట సంక్షేమ పథకాలను ప్రజలకు అందజేస్తున్నామని చెప్పారు. నాడు–నేడు ద్వారా పాఠశాలలు, ఆసుపత్రులు అభివృద్ధి చేస్తున్నామన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయన్నారు. వచ్చే ఎన్నికల్లో తిరిగి వైఎస్సార్ సీపీకే పట్టం కట్టాలని పిలుపునిచ్చారు. అనంతరం గ్రామంలో నూతనంగా నిర్మించబోయే శ్రీ కృష్ణుడి ఆలయానికి ఎమ్మెల్యే, ఎంపీపీ, ఇతర స్థానిక నాయకులు భూమి పూజ చేశారు.ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ పెనుమాల విజయ్‌బాబు, ఎంపీపీ తాతా రమ్య, పెదవేగి సొసైటీ చైర్‌పర్సన్ పెనుమాక వెంకట సుబ్బారావు, ముండూరు సొసైటీ చైర్‌పర్సన్ చెరుకూరి ప్రసాద్, సర్పంచ్ జిజ్జువరపు నాగరాజు, స్థానిక నాయకులు మేడికొండ కృష్ణారావు, కొల్లు రాము, మేడికొండ మురళి, జాస్తి సీతారామాంజనేయులు, మేడికొండ బుజ్జులు, పరిమి శివనాగరాజు, మేడికొండ సారథి, యలమంచి ప్రవీణ్‌చౌదరి, నెరుసు ధర్మరాజు, గోళ్ళ మల్లేశ్వరరావు, ఇతర ప్రజా ప్రతినిధులు, సొసైటీ అధ్యక్షుడు, పార్టీ అధ్యక్షుడు, మాజీ ప్రజా ప్రతినిధులు, పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షుడు సభ్యులు, అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు స్వయం సమృద్ధి సాధించాలి



భీమడోలు: ఇందిరాగాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న గుల్ల నూకరాజు తదితరులు



గణపవరం: పిప్పరలో ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం



ఉంగుటూరు: సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి

గణపవరం: మహిళలు అన్ని రంగాల్లో స్వయం సమృద్ధి సాధించి, పురుషులతో సమానంగా జీవించాలని పలువురు అన్నారు. ఆదివారం గణపవరం మండలం పిప్పర శాఖాగ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా దిశ చట్ట, మహిళల రక్షణ, స్వయం సమృద్ధి అంశాలపై చర్చా గోష్ఠి నిర్వహించారు. ఈ సందర్భంగా ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అత్తిలి డిగ్రీ కాలేజీ ప్రిన్సిపల్ హనుమశర్మ మాట్లాడుతూ మహిళలపై రోజురోజుకూ అఘాయిత్యాలు, అకృత్యాలు, దాడులు పెరిగిపోతున్నాయని, వీటిని ఎదుర్కోవడానికి మహిళలు సర్వం సన్నద్ధంగా ఉండాలని పిలుపు ఇచ్చారు. గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు గుడ్ల వెంకటకృష్ణారావు, ఐఎన్‌రాజు, చంటిబాబు, వెంకట్రాజు, గ్రంథపాలకుడు రంగారావు పాల్గొన్నారు.

విద్యార్థులకు పోటీలు

దెందులూరు: విద్యార్థులు ప్రాథమిక స్థాయి నుంచి పోటీతత్వం, పరిశీలన కలిగి ఉండాలని పోతునూరు గ్రంథాలయాధికారి డీ.రాంబాబు అన్నారు. ఆదివారం గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా పోతునూరు గ్రంథాలయంలో వ్యాసరచన, వకృత్వం పోటీలు నిర్వహించారు. సీనియర్, జూనియర్ విభాగాల్లో విజేతలను అభినందించారు. గ్రంథాలయ ముగింపు వారోత్సవాల్లో విజేతలకు బహుమతులు అందజేస్తామని గ్రంథాలయాధికారి రాంబాబు అన్నారు. పోతునూరు ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు షేక్ అశీం వలీ ఇందిరాగాంధీ చిత్రపటాన్ని గ్రంథాలయానికి అందజేశారు.

గ్రంథాలయంలో మహిళా దినోత్సవం

ఉంగుటూరు: ఉంగుటూరు శాఖా గ్రంథాలయంలో ఆదివారం మహిళా దినోత్సవం నిర్వహించారు. ఇందిరాగాంధీ చిత్రపటానికి పూల మాలవేశారు. ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి, ఇందిరాగాంధీ పటానికి పూల మాల వేశారు. ఈ సందర్భంగా దిశ చట్టాన్ని ప్రజలకు హెడ్ కానిస్టేబుల్ బి.ప్రసాదు వివరించారు. విద్యార్థులు గ్రంథపాలకుడు గంగాధరరావు పాల్గొన్నారు.

దిశ చట్టం మహిళల పాలిట వజ్రాయుధం

భీమడోలు: దిశ చట్టం మహిళల పాలిట వరమని మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ మండల చైర్మన్, భీమడోలు సర్కిల్ దిశా అమలు కమిటి సభ్యురాలు, మానవత మండల చైర్మన్ గుల్ల నూకరాజు అప్పారావు అన్నారు. మండలంలోని భీమడోలు, పూళ్ల, గుండుగొలను శాఖా గ్రంథాలయాల్లో ఆదివారం తొలి మహిళా ప్రధాని ఇందిరాగాంధీ 106వ జయంతిని పురస్కరించుకుని ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. దిశా చట్టం, మహిళాసాధికారత అంశంపై అవగాహన సదస్సును నిర్వహించారు. భీమడోలులో గ్రంథపాలకుడు కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో గ్రంథాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్, డైమండ్స్ లయన్స్ చార్టెడ్ క్లబ్ చైర్మన్ తుమ్మల ఉమామహేశ్వరరావు అధ్యక్షత వహించారు.ముఖ్య అతిథులుగా గుల్ల నూకరాజు, విద్యావేత్త జటావల్లభుల సాయిరామ్, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మండే సుధాకర్ హాజరయ్యారు. గుల్ల నూకరాజు అప్పారావును దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. బాలికలకు వివిధ పోటీలు నిర్వహించారు. గుండుగొలను లైబ్రేరియన్ జి.నాగమణి ఆధ్వర్యంలో చిన్నారులకు ప్రాథమిక విధులు–హక్కులు అంశంపై వక్తృత్వ పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రంథపాలకులు డీఎన్‌బీ అమర్‌నాథ్, జి.నాగమణి, పెద్దలు యర్రంశెట్టి ఏడుకొండలు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

సూక్ష్మ కళాకృతులతో కళాకారుడి అద్భుత సృష్టి



కొమ్మోజు అశోక్, సూక్ష్మ కళాకారుడు



250 మిల్లీగ్రాముల బంగారంతో చేసిన వరల్డ్ కప్పు

గణపవరం: గణపవరానికి చెందిన ఓ కళాకారుడు సూక్ష్మ కళాకృతులు తయారు చేస్తూ ఆకట్టుకుంటున్నాడు. ప్రపంచ కప్ క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్న సందర్భంగా 250 మిల్లీగ్రాముల బంగారంతో అతి చిన్నదైన ప్రపంచ కప్పును, దానికి ఇరువైపులా భారత జాతీయ పతాకాలను తీర్చిదిద్ది భారత జట్టుకు అంకితమిచ్చాడు. గణపవరం మండల స్వర్ణకార సంఘం అధ్యక్షుడు, సూక్ష్మ కళాకారుడు కొమ్మోజు అశోక్ ఆదివారం అతి తక్కువ బంగారంతో ఆకర్షణీయంగా బియ్యపు గింజకన్నా తక్కువ పరిమాణంలో అతిచిన్నదైన ప్రపంచకప్పు తయారు చేశాడు. దీనికోసం మూడురోజుల పాటు శ్రమించాడు. 2011లో నిర్వహించిన ప్రపంచ కప్పు క్రికెట్ పోటీల సమయంలో అశోక్ 250 మిల్లీగ్రాముల బంగారంతో అతి సూక్ష్మమైన క్రికెట్ కప్పును తయారుచేసి భారతజట్టుకు అంకితమిచ్చాడు.

ఘనంగా ఆర్యవైశ్యుల ఆత్మీయ కార్తీక వన సమారాధన



కార్తీక వన సమారాధనలో మహిళలు తమ సందేశాలను అందిస్తున్న దృశ్యం

భీమడోలు: భీమడోలు ఆర్యవైశ్య యువత ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ కార్తీక వన సమారాధన కార్యక్రమం ఉల్లాసభరిత వాతావరణంలో ఆదివారం పోలసానిపల్లి శివారులోని ఓ తోటలో ఏర్పాటు చేశారు. ఆర్యవైశ్యులు కుటుంబ సమేతంగా తరలివచ్చి తొలుత వాసవి మాతకు ప్రత్యేక పూజలు చేసారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ చిన్నా పెద్దా తేడా లేకుండా సరదాగా గడిపారు. యువతులు, మహిళలు నృత్యాలు చేసి సందడి చేసారు. వివిధ పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందించారు. అనంతరం వారంతా వనసమారాధనలో భోజనాలు చేసారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్యులు, పెద్దలు, యువతీ యువకులు పాల్గొన్నారు.

హిందూ ఆలయాలను కుటుంబాలతో సహా దర్శించండి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఇటీవల హిందువులు ఆలయాలకు కుటుంబాలతో వెళ్లడం లేదని, రానురాను హిందువుల్లో ఐకమత్యం సన్నగిల్లుతున్న నేపథ్యంలో హిందువులు కుటుంబ సభ్యులతో సహా ఆలయాలను దర్శించాలని భువనేశ్వరి పీఠం స్వామీజీ కమలానంద భారతి జీ పిలుపునిచ్చారు. సమరసతా సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక గీతామందిర్‌లో ఆదివారం హిందూ సమ్మేళనం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న స్వామీజీ మాట్లాడుతూ హిందు వులను ఏకం చేయడం కోసమే సమరసతా సేవా ఫౌండేషన్ సమ్మేళనాలు నిర్వహిస్తోందన్నారు. తొలుత నగరవీధుల్లో 200 మందితో నగర సంకీర్తనలతో శోభాయాత్ర నిర్వహించారు. హిందూ ధర్మరక్షా సమితి రాష్ట్ర కార్యదర్శి కేఎస్‌ఎస్ సుబ్రహ్మణ్యం, ధనెంకుల గోపాలకృష్ణ, నగర కన్వీనర్ ప్రసాద్, రాంబాబు పాల్గొన్నారు.

ఉచిత హోమియో వైద్య శిబిరం



అప్పనవీడులో ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్న డాక్టరు రవీందర్

పెదపాడు: ప్రముఖ హోమియో వైద్య నిపుణులు డాక్టరు చింతా రవీందర్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఆదివారం ఏర్పాటు చేసారు. ఈ వైద్య శిబిరంలో రుమటాలజీకి సంబంధించిన కీళ్ల, కండరాల వ్యాధులకు, మోకాళ్ల నొప్పులు, మెడనొప్పి, నడుము నొప్పి, సయాటికా, కీళ్ల వాతం గౌట్ వంటి వ్యాధులకు వైద్య చికిత్స చేసి ఉచితంగా మందులు పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ అప్పన కనక దుర్గా ప్రసాద్, చైర్మన్ నెర్సు నాగభూషణం పాల్గొన్నారు.

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.లక్ష విరాళం

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు ఒక భక్తుడు ఆదివారం రూ.లక్ష విరాళంగా అందజేశారు. గన్నవరం మండలం కేసరపల్లికి చెందిన జాస్తి మధు కల్యాణ్ ముందుగా కుటుంబ సభ్యులతో కలసి స్వామి, అమ్మవార్లను దర్శించారు. అనంతరం ఈ విరాళాన్ని ఆలయ కార్యాలయంలో జమచేశారు. దాత కుటుంబానికి ఆలయ సూపరింటెండెంట్ మద్దాల శ్రీను విరాళం బాండ్ పత్రాన్ని అందించారు.

వేంకటేశ్వర స్వామికి విశేష పూజలు



గుండుగొలనులో వేంకటేశ్వర స్వామికి పూజలు చేసిన అర్చక బృందం

భీమడోలు: గుండుగొలనులో వేంచేసియున్న దేవాదాయ ధర్మదాయ శాఖకు చెందిన శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం శ్రవణం నక్షత్రం పురస్కరించుకుని ఆలయంలో పాలాభిషేకాలు, ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. ఆలయ నిర్వాహకురాలు, వైసీపీ నేత వగ్వాల అచ్యుత రామారావు ఆధ్వర్యంలో పూజారులు మంగపతి ఆచార్యులు, అర్చకులు శాస్త్రోక్తంగా పూజలు చేసారు. స్వామి వార్లకు క్షీరాభిషేకం చేసి విశేషంగా అలంకరించారు. పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారిని దర్శించుకుని విశేష పూజలు చేసారు. ఈ కార్యక్రమంలో పెద్దలు నీలం రాంబాబు, భక్తులు పాల్గొన్నారు.